

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేత
● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ 7

చాపకింద నీరులా డయేరియా
● ఒకరి మృతి, పలువురికి తీవ్ర అస్వస్థత
● ఆసుపత్రికి పరుగులు పెడుతున్న బాధితులు 7




గూడెం గోదావరి నీటిపై సూర్యాస్తమయం ఎర్రటి కిరణాలు

నింగీ.. నీరు.. మారింది రంగు

రెండు గుట్టల మధ్య నుంచి సూర్యుడు సంధ్యా సమయంలో కిందకు దిగుతుండగా ఎర్రటి కిరణాలు గోదావరి నదిపై ప్రతిబింబించాయి. నిశ్చలమైన నీటిలో ఎర్రటి సూర్యకిరణాలు పడడంతో నది అంతా అరుణారుణ వర్ణమై చూపరులను ఆకట్టుకుంది. మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులోని దండేపల్లి మండలం గూడెం గోదావరి నదిలోని ఈ దృశ్యం శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

- దండేపల్లి



గూడెం గోదావరి నదిపై సంధ్యాసమయంలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, టీకనపల్లి, దొనబండ, పెద్దంపేట్, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తన్‌పల్లి, కొండపల్లి, రాంపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): తాండూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 గంల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, బోయపల్లి, చౌటపల్లి, ఐబీ, కొత్తపల్లి, రేపల్లెవాడ, మాదారం, కాసిపేట, చంద్రప ల్లి, ద్వారకాపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండ దని తెలిపారు.

వేమనపల్లి (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లెడ, నాగారం, బద్దెంపల్లి, లక్ష్మీపూర్, జక్కపల్లి, చామనపల్లి, సూరారం, బుయ్యారం, గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కాసిపేట(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బెల్లంపల్లి డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులు పాఠశాలకు రావాలి

జన్నారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలలకు హాజరు కావాలని ఎంఈవో విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొనకల్ గ్రామంలో పాఠశాలలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేష్, సీఆర్‌పీ దయాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని కేవీకే



- ఏడేళ్లుగా నిధులు మంజూరుకాని వైనం
- ప్రహరీలేక పంటలు పశువులు, అడవి జంతువులపాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైనసేవలు, ఆధునిక సాంకేతికతను చేరువచేయడంతో పాటు వివిధ అంశాల్లో మెరుగైనసేవలు అందిం చాలనే సంకల్పంతో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల రైతుల కోసం ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) అభివృద్ధికి నోచుకోవడం లేదు. బెల్లంపల్లి లో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభమైన ఏడేళ్ల నుంచి అభివృద్ధి కోసం నిధులు రావడం లేదు. దీంతో కేవీకే ఆవరణలో సాగుచేసిన పంటలకు రక్షణ కోసం ఎలాంటి ఫెన్సింగ్, ప్రహరీ లేకపోవడంతో పంటలు పశువుల పాలవు తున్నాయి. భూమి చదును లేకపోవడంతో విత్త నోత్పత్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

సాగుకు నోచుకోని భూమి..

కృషి విజ్ఞాన కేంద్రం 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కాగా భవనం, రైతు వసతి గృహం, రహదారులు పోనూ మిగతా భూమిని శాస్త్రవేత్తలు వివిధ పంటల సాగుకు ఉపయోగించాలి. కాని ఇందులో కేవలం 20 ఎకరాల భూమి మాత్రమే సాగుచేసి విత్తనోత్పత్తి చేస్తున్నారు. ఇందులో వరి, పత్తి, తీగజాతి, కూరగాయల పెంపకం, వంగడాల ఏర్పాటు, చేపల పెంపకం వంటివి చేస్తున్నారు. దాదాపు మరో 25 ఎకరాల భూమి సాగు లేక బీడుగా ఉంది. ఈ భూమి చదునుగా లేకపోవం, సాగుకు అనుకూలంగా లేకపోవడంతో సాగుచేయలేని దుస్థితి నెలకొంది. ఏడేళ్లుగా నిధులు రాకపోవడంతో భూమిని చదును చేయలేక సాగు చేయడం లేదు.

● 50 ఎకరాల్లో ఏర్పాటు..

బెల్లంపల్లిలో 2018లో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 50ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. ఇందులో రెండుకోట్ల రూపాయలతో కృషి విజ్ఞానకేంద్రం భవనంతో పాటు రూ.80లక్షలతో రైతు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఏడేళ్లుగా సేవలందిస్తోంది. కేవీకే ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ, చీడపీడల నివారణ, నూతన వంగడాలను అందించడం వంటివి కేవీకే శాస్త్రవేత్తలు చేస్తున్నారు. సాంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో కిసాన్ మేళా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

● పంటలు అటవీ జంతువుల పాలు..

కేవీకే ఆవరణలో దాదాపు 20ఎకరాల భూమిలో వివిధ పంటలు విత్తనోత్పత్తి కోసం శాస్త్రవేత్తలు సాగు చేస్తున్నారు. కొన్నిపంటలు మొక్క దశలోనే అటవీ జంతువులు, పశువుల పాలవుతున్నాయి. మరికొన్ని పంటలు దిగుబడి వచ్చే సమయంలో..

మిగతా 8లో

మండల ప్రత్యేకాధికారిగా దుర్గాప్రసాద్



పదవి భాద్యతలు చేపడుతున్న దుర్గప్రసాద్

దండేపల్లి, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ శుక్రవారం దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మండల ప్రత్యేక అధికారిగా కొనసాగిన డీఎస్‌సీడీవో రవీందర్‌రెడ్డి స్థానంలో దుర్గాప్రసాద్ మండల ప్రత్యేకఅధికారిగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేస్తానని తెలిపారు. మండల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు తనకు సహకరించాలని కోరారు.

కాంస్య పతకం సాధించిన విద్యార్థులు



కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమగురుకుల పాఠశాల విద్యార్థులు కాంస్య పథకాలు సాధించారు. హర్షవర్దన్,విశ్వతేజ, వర్షిత్, సంకీత్ సాయి, రిషేందరవర్మ,రుసికేష్‌లు ప్రతిభ కనబర్చారు. వీరిని శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, వైస్‌ప్రిన్సిపాల్ విజయసాగర్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, వామన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ నిజామా బాద్ ఆదిలాలాబాద్ కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభ ద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరిగే పోలింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు సంస్థలు, వ్యాపారం, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

సవాళ్లను ఎదుర్కొనే శక్తి కలిగి ఉండాలి

కోటపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండి సవాళ్లను ఎదుర్కొనే శక్తి కలిగి ఉండాలని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాము అన్నారు. శుక్రవారం పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శరీరంలో మార్పులు, మార్పులకు అనుగుణంగా ఆరోగ్యం, పర్సనాలిటీ, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి అనిత, లిల్లి జోయెల్, హెల్త్ సూపర్ వైజర్ ఇందిర, ఏఎన్ఎం తిరుపతమ్మ పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా

జైపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జైపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముస్తాఫా పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయడం జరుగుతుందన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికి మాత్రలను వేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాటశాలల్లోని పిల్లలకు మాత్రలను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, జిల్లా కో ఆర్డినేటర్ నాందేవ్, సతీష్, ఎంఈవో శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, అంగన్‌వాడీలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అటవీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు

జన్నారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని రేంజ్ అధికారులకు అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం జన్నారంలో వైల్డ్‌లైఫ్ సెంటర్ అధికారి డాక్టర్ నరేంద్రన్ కోదండపాణి అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో జరిగే అగ్నిప్రమాదాలపై తీసుకునే చర్యలపై వివరించారు. ప్రతీ అధికారి వేసవిలో అటవీ ప్రాంత సమీపంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన్యప్రాణుల సంరక్షణపై సూచనలు చేశారు. అటవీ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి, వన్యప్రాణుల దాహార్తిని తీర్చడం, వాటి రక్షణపై రేంజ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీఅధికారి వేసవిలో ప్రతి బీట్‌ను పరిశీలించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టు డెవలప్‌మెంట్ ప్రాజెక్టు టైగర్ అధికారి శాంతారాం, డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

తాండూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, రోడ్లను ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డిప్యూటి తహసీల్దార్, రాజీవ్‌నగర్ స్పెషల్‌ఆఫసీర్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 174లో ప్రభుత్వ రహదారిపై అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించారు. కార్యక్రమంలో గిర్దవార్ ఎజాజొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'తప్పుల తడకగా కుల గణన సర్వే'



మౌన ప్రదర్శన చేస్తున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తప్పుల తడకగా కుల గణన సర్వే ఉందని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నోటికి గుడ్డలు కట్టుకుని మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీలను తక్కువగా చూపించడం అంటే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కాపాడుకోవడమే అవుతుందన్నారు. అలాగే పూర్తిస్థాయిలో కులగణన చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో ఏడు శాతం ఉన్న అగ్ర కులాలు రెట్టింపు కావడం, 56 శాతం ఉన్న బీసీలు 46శాతానికి పడిపోవడం రాజకీయ కుట్రగా భావిస్తున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను నమ్మి కాంగ్రెస్ పార్టీకి బీసీలందరు ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సమాజాన్ని నమ్మించి మోసం చేయడం సరైంది కాదన్నారు. అలాగే 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ పరంగా 42 శాతం ఇస్తామని ప్రకటించడం బీసీలను మోసం చేయడమే అవుతుందన్నారు. వెంటనే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు చుంచు రాజ్‌కిరణ్, కార్తెలచ్చన్న, గజెల్లి వెంకటయ్య, బీమ్‌సేన్, రాములు, చంద్రమౌళి, సల్మాన్, సతీష్, రాజేశం, విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జీవితం ప్రతీ ఒక మహిళలకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాసు, ప్రధానకార్యదర్శి బైరం రవి, సభ్యులు చాతరాజు రాజన్న, ధర్మన్న, నారాయణ, శంకర్, నర్సయ్య, సత్తన్న, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. క్రిష్ణకాలనీలో జరిగిన వేడులకు ముఖ్య అతిథులుగా ఎస్సీ లైజన్ అధికారి, అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు, పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లక్ష్మణ్, నరేష్, యోసఫ్, యుగేందర్ సాయి, కిరణ్, బాబూరావు, తిరుపతి, కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి(ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను మాల మహానాడు నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్‌చేశారు. గర్భిణీలకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంబాల రాజేష్, పొట్టు శేఖర్, ఆసాధి మధు, గోపి, కుమార్, సుభాష్, సురేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఎల్‌ఐసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రమాబాయిఅంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లేష్, సురేందర్, ఉపాధ్యాయులు విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

పౌష్టికాహారం అందేలా చర్యలు

కరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బెజ్జూరు



ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సూపర్‌వైజర్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. అన్ని కేంద్రాల్లోనూ పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: కొన్ని కేంద్రాలో కేంద్రాల్లో సరిగా అందడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. దీనికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సూపర్‌వైజర్: అన్ని కేంద్రాల్లో పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేశాం. మా దృష్టికి వస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.


ఆంధ్రజ్యోతి: కొన్ని కేంద్రాల్లో సమయపాలన పాటించడం లేదని చెబుతున్నారు, దీనిపై తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సూపర్‌వైజర్: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. తరుచూ తనిఖీ చేస్తూ సూచనలు చేస్తున్నాం.

- బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి)

పెరిగిన ఎంపీటీసీ స్థానాలు

- జిల్లాలో 127కు చేరిక
- జాబితా సిద్ధం చేసిన అధికారులు



ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కొత్తగా నాలుగు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. జిల్లాలో ప్రస్తుతం 123 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కొత్తగా పెరిగిన వాటితో 127కు చేరుకున్నాయి. 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రతి మండలానికి కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలన్న నిబంధన ఉంది. దీంతో జిల్లాలో ఐదు కంటే తక్కువ స్థానాలున్న మం డలాల్లో ఒక్కో స్థానం పెంచేందుకు అధికా రులు ప్రతిపాదిం చారు.

పెరిగిన స్థానాలివే..

జిల్లా కేంద్రంలో రాజం పేటను ప్రత్యేక పంచా యతీగా ఏర్పాటు చేయడంతో అక్కడ ఒక ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేశారు. గతంలో గుండి, గోవింద్‌పూ ర్, సాలేగూడ గ్రామాల ను కలిసి గుండి ఎంపీటీసీ కేంద్రంగా ఉండేది. కొత్తగా వీటి నుంచి సాలేగూడను విడదీసి రాజం పేట పంచాయతీకి కలిపి రాజంపేట కేంద్రంగా ఏర్పాటు చేశారు. సిర్పూర్ (యూ) మండలంలోని రాఘవపూర్, లింగాపూర్‌లోని కంచన్ పెల్లి, పెంచికల్ పేటలోని కమ్మర్‌గాం కేంద్రాలుగా ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటయ్యాయి.

ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నం..

జిల్లా, మండల పరిషత్‌ల పదవీ కాలం పూర్తయి ఎనిమిది నెలలు దాటింది. గత జూలై 4వ తేదీతో పాలక వర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో అధికారులు ఎన్నికల పనులను ముమ్మరం చేశారు. అయితే ముందుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా? లేదా జిల్లా మండల పరిషత్ ఎన్నికలు జరుగుతాయా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రాగానే ఎన్నిలను నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూళ్లు ఎప్పుడు విడుదలైనా ఎన్నికలు నిర్వహించడానికి అధికారుల సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలకు అవసరమయ్యే సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రా లను సిద్ధం చేశారు.

కొత్తవరిపేట శివారులోనే పెద్దపులి సంచారం



అధికారులు గుర్తించిన పెద్ద పులి పాదముద్ర

కాసిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవరిపేట సమీపంలో గురువారం తెల్లవారుజామున అడవి పందిపై దాడి చేసిన పెద్దపులి రెండు రోజులుగా అదే ప్రాంతంలో సంచరిం చడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం అటవీ శాఖ అధికారులు దాడి చేసిన సంఘటన స్థలంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అనంతరం వరిపేట, బుగ్గగూడెం, కొత్తవరిపేట, పల్లంగూట గ్రామాల్లోని ప్రజలకు పులి సంరక్షణ, పులి బారినుంచి ఎలా కాపాడుకో వాలనే విషయంపై అవగాహన కల్పించారు. డిప్యూటి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పెద్దపులికి ఎవరు హానీ తలపె ట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పులి బారి నుంచి కాపాడుకునేందుకు ప్రజలందరు గుంపులు గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. కొద్ది రోజుల వరకు వ్యవసాయ కూలీ లు, రైతలు, కాపరులు అడవివైపు వెళ్లవద్దని సూచించారు. చేన్లకు వెళ్లకపోవడంతో పత్తి నేల రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపులి గ్రామాల సరిహద్దు, పరిసర ప్రాంతాల్లో సంచరించడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

పార్కు చేసిన బైక్ నుంచి రూ. 4.40 లక్షలు చోరీ



సీసీ కెమెరాలో నమోదైన చోరీకి పాల్పడిన వ్యక్తి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం పార్కు చేసిన బైక్ నుంచి రూ. 4.40 లక్షలను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి అనే వ్యక్తి శుక్రవారం పట్టణంలోని ఎస్‌బీఐలో రూ. 4.40 లక్షలు విత్‌డ్రా చేశాడు. డబ్బులను తన ద్విచక్రవాహనం ట్యాంకు కవర్‌లో పెట్టుకుని కూరగాయలు కొనేందుకు కూరగాయల మార్కెట్ ఎదుట బైక్‌ను పార్క్ చేశాడు. ఈ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నెంబరు ప్లేటు లేని ద్విచక్రవాహనంపై వచ్చి పార్కింగ్ చేసిన బైక్‌లో నుంచి రూ. 4.40 లక్షలను ఎత్తుకెళ్లిపోయారు. వెంకటస్వామి కూరగాయలు కొనుక్కుని బైక్ వద్దకు వచ్చి ట్యాంకు కవర్‌లో డబ్బులు లేకపోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. కాగ తన అన్న కూతురు వివాహం మరికొద్ది రోజుల్లో ఉండడంతో బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసినట్లు బాధితుడు వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు.

● ముందస్తు ప్రణాళికతోనే..

పార్కింగ్ చేసిన బైక్ ట్యాంకు కవర్ నుంచి రూ. 4.40 లక్షలు చోరీ చేసిన దుండగులు ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు నిర్ధారణ అయ్యింది. వెంకటస్వామి బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసినప్పటికీ నుంచి తన బైక్ వెనకాలనే దుండగులు క్యాప్ ధరించడంతో పాటు ముఖం కనిపించకుండా మాస్కులు ధరించి అనుసరించారు. చోరీకి అవకాశం కోసం చూస్తుండగా కూరగాయల మార్కెట్ వద్ద బైక్‌పార్క్ చేయడంతో ఇదే అదునుగా భావించి బైక్ ట్యాంకు కవర్‌లో నుంచి డబ్బులు ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో, కూరగాయల మార్కెట్ చౌరస్తా వద్ద నంబరు ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై అనుసరించి డబ్బులను దొంగలించిన సీసీ కెమెరా పుటేజీలను పోలీసులు పరిశీలించారు.

డీజిల్ అక్రమ నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 535 లీటర్ల డీజిల్ ట్యాంకర్ స్వాధీనం

కాసిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ యాప సమీపంలో ట్యాంకర్‌లో అనుమతి లేకుండా డీజిల్‌ను రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 535 లీటర్ల డీజిల్‌తో పాటు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా అనుమతిలేని ట్యాంకర్‌తో డీజిల్‌ను సరఫరా చేస్తున్నారని తెలిపారు. తమకం దిన సమాచారం మేరకు దాడి చేసి ట్యాంకర్‌తో పాటు డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 6ఏ కేసు నమోదు చేసి అదనపు కలెక్టర్‌కు నివేదికలు అందజేసినట్లు తెలిపారు. స్థానిక ఖాన్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ డీజిల్ తరలించేందుకు ట్యాంకర్‌కు ఎఫ్ లైసెన్స్ లేకుండానే కొంత కాలంగా అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ట్యాంకర్‌ను, డీజిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



జిల్లా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ, ఆసుపత్రిలో ప్రసవాల వివరాలు అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ప్రభుత్వం పేద రోగులకు వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. వాటిని క్షేత్ర స్థాయిలో అందేలా చూడాలన్నారు. జిల్లాలో జరిగే ప్రతి ప్రవసం ఆసుపత్రిలో జరిగే విధంగా వైద్య సిబ్బంది చూడాలన్నారు. దీని కోసం గర్భిణీలను గుర్తించి వారికి 9 నెలల పాటు అవసరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు సుఖ ప్రసవానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. అప్పుడే వైద్య సేవలపై సాధారణ ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యవసరమైతే తప్ప వేరొక చోటికి పంపించకూడదని సూచించారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలను రోగులకు పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ రోగులతో మాట్లాడారు. వారికి సరైన సౌకర్యాలు అందించాలన్నారు .ప్రతిష్టాత్మకంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లలో మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంటుందన్నారు. సేవల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 320 పడకల ఆసుపత్రిని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు ఎప్పటిక వరకు పూర్తయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడీహెట్టిలో నాటు సారాయి తయారీకి ఉపయోగిం చే 630 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, 20 లీటర్ల నాటు సారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. సమాచారం మేరకు ఆటోను తనిఖీ చేయగా పటిక, బెల్లం, నాటు సారా పట్టుబడిం దన్నారు. వాటిని తరలిస్తున్న లంబాడీహెట్టికి చెందిన అజ్మీర కరుణ, ఈసుగాంకు చెందిన సాయిరమేష్, బడే వేణులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యార్థుల పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31 వరకు పొడిగించినట్ల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. కళాశాలల యజమాన్యాలు చొరవ తీసుకొని పూర్తి చేయాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

సిర్పూర్(టి), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కౌటాల నుంచి పెద్దపలి జిల్లా జూలపల్లికి అక్రమంగా వ్యాన్(టీఎస్21 టీ1100)లో తరలిస్తున్న ఐదు పశువులను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐ రమేష్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. పశువులను రవాణా చేస్తున్న కుమ్మ కుమార్, కాంపెల్లి కరణ్‌లతో పాటు యజమానులైన రాజమల్లు, వెంకటిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆహ్వాన పత్రిక అందజేత

రెబ్బెన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ ఆలయంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించే జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను సింగరేణి ఏరియా జీఎం శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ తరుపున శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆల య చైర్మన్ లెండుగురే జయరాం, ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, ప్రకాష్, ఆలయ డైరెక్టర్ దుప్ప నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు మోడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, పల్లాస్, గంటుమేర, గోగర్ల రాజేష్, విమలేష్, నర్సింగరావు, స్వామి పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

జైనూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నాపూర్, జైనూరు మండల కేంద్రంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మణ పనులను వేగవంతం చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో శుక్రవారం ఆయనపనులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకరరెడ్డి, ఎంపీవో మోహన్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అరుణ, మాజీ సర్పంచ్ కందరె బాలాజీ, నాయకుడు అంబాజీరావ్, ఏపీవో నగేష్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై ఇస్లావత్ నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని డబ్బా గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పరదేశి, శ్రీశైలం, విలాస్, సాగర్ పాల్గొన్నారు.

మారుపేర్లకు మోక్షమెప్పుడు?

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల మారు పేర్లకు మోక్షం ఎప్పుడు లభిస్తుందో తెలియడం లేదు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వారి అనుబంధ సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో పాటు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా మారు పేర్లను మారుస్తామని హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదు. మూడు దశాబ్దాల క్రితం మారు పేర్లతో ఉద్యోగాల్లో చేరిన వారు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణిలో అధిక శాతం అనారోగ్యం, ఇతర కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయితే వారి పిల్లలకు సింగరేణి ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో సింగరేణి విజిలెన్స్ విభాగం అధికారులు వారి ఫైళ్లను తీసుకువెళ్లి విచారణ చేపడుతున్నారు . కుటుంబ పెద్ద రిటైర్ అయి కుటుంబీకులకు ఉద్యోగాలు రాక ఆందోళన చెందుతున్నారని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎండీ జాఫర్ అన్నారు. ఈ విషయంపై ముఖ్యంత్రికి లేఖలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూకొంత మంది అల్లుల్లు, కొడుకుల పేరిట ఉద్యోగాల్లో చేరిన వారు చాలా మంది ఉన్నారన్నారు., మారు పేర్లతో ఉద్యోగాలు చేసిన వారు సంస్థ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

ఇన్‌చార్జీల పాలనలో సింగరేణి



- డైరెక్టర్లను నియమించని యాజమాన్యం
- ఒక్కొక్కరికి ఏళ్ల తరబడి అదనపు బాధ్యతలు
- ఆరుగురు డైరెక్టర్లకు మిగిలింది ఇద్దరే...
- పదవీకాలం పొడిగింపుపైనే సీఎండీ

గోదావరిఖని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పలు డైరెక్టర్ స్థానాలు ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థ ఆర్థికంగా, సాంకేతికంగా, నిర్వహణ పరంగా చర్చించి సంస్థ భవిష్యత్‌ను నిర్ణయించే డైరెక్టర్ బోర్డులో పదేళ్లుగా డైరెక్టర్ల కొరత కొన సాగుతోంది. సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)తో పాటు ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), డైరెక్టర్(పా), డైరెక్టర్ (ఫైనాన్స్), డైరెక్టర్ (ఈఅండ్‌ఎం), డైరెక్టర్(ఆపరేషన్స్). వీరంతా కలిసి సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా ఉంటారు. వీరితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎనర్జీ డిపార్ట్‌మెంట్ అధికారులను డైరెక్టర్లుగా నియమిస్తారు. అయితే డైరెక్టర్ (ఫైనాన్స్)గా సింగరేణికి వచ్చిన బలరాంనాయక్ కొంతకాలం డైరెక్టర్ (పా)గా రెండు బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత ఆయన సింగరేణి సీఎండీగా సంవత్సరం క్రితం నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం పొడిగించారు. డైరెక్టర్(పీపీ)గా ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డి జూలై 31న పదవీ విరమణ చేయను న్నారు. ఈ ఐదు మాసాలకు అతనికి డైరెక్టర్‌గా తిరిగి అవకాశం రాదని చెప్పుకుంటున్నారు. వారం రోజుల క్రితం వెంకటేశ్వర్‌రెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) తీసుకుంటారనే ప్రచారం వినిపించింది. ఆంధ్రప్రదేశ్ జెన్‌కోలో అతనికి అవకాశం ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

ఇక డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను కొంత కాలంగా పక్కన పెట్టారు. అతని డైరెక్టర్ పదవీకాలం ముగిసింది. అతనికి ఇంకా రెండేళ్ల సర్వీసు ఉంది. ఆయన తిరిగి సీజీఎంగానే కొనసాగుతున్నారు. వారం రోజుల క్రితం సీనియర్ సీజీఎంలను కార్పొరేట్‌కు పిలిపించారు. అర్హతలను బట్టి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమించేందుకు పిలిపించగా అనివార్య కారణాలతో సెలక్షన్‌ను వాయిదా వేశారు. ఈఅండ్‌ఎం డైరెక్టర్‌గా ఉన్న సత్యనారాయణరావు ప్రస్తుతం సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్)గా ఇన్‌చార్జి బాధ్యతలు చూసుకుంటున్నారు. సింగరేణి సంస్థకు పూర్తి స్థాయిలో ఐదేళ్లుగా డైరెక్టర్(పా) లేనే లేడు. బలరాం నాయక్ సీఎండీ అయిన తరువాత డైరెక్టర్(ఫైనాన్స్) కూడా లేడు. ఈ బాధ్యతలను సీఎండీనే చూసుకుంటున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయి పదవీ బాధ్యతల్లో డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు మాత్రమే ఉన్నారు. బలరాం నాయక్, సత్యనారాయణరావు మినహా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒక్కరు కూడా లేరు. ఆరు డైరెక్టర్ పదవుల్లో సత్యనారాయణరావు రెండు, సీఎండీ మిగతా డైరెక్టర్ పదవులు చూసుకుంటున్నారు. డైరెక్టర్ల ఖాళీల భర్తీ విష యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎండీ ఉదాసీనంగా ఉంటున్నారు.

డైరెక్టర్లు లేకపోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని సంఘాల నాయకులు పేర్కొంటున్నాయి. సింగరేణి విస్తరణ, విద్యుత్ రంగంపై దృష్టి కారణాలతో సీఎండీ బలరాం పని ఒత్తిడికి లోనుకావడం, ఒకే డైరెక్టర్‌తో సింగరేణి నడిపించడం శ్రేయస్కరం కాదని కార్మిక సంఘాలంటున్నాయి. ఇప్పటికైనా సింగరేణిలోని డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని కార్మిక సంఘాలంటున్నాయి. గతంలో డైరెక్టర్(పా)గా ఐఏఎస్ అధికారులను నియమించేవారు. సీఎండీ కూడా ఐఏఎస్ అధికారి ఉండేవారు. ప్రస్తుతం ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ నుంచి వచ్చిన బలరాంనాయక్‌ను సీఎండీగా నియమించి మిగిలిన డైరెక్టర్ పోస్టుల్లో ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ అధికారిని నియమించాలి. యేటా 75మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ రూ.30వేల కోట్ల టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థకు డైరెక్టర్లు లేకపోవడం అనుమానాలను వ్యక్తం చేస్తున్నది. థర్మల్, సోలార్, విద్యుత్ సంస్థల నిర్వహణ, ఒడిశాలోని నైని బ్లాక్‌ను ఉత్పత్తి, సంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టు లాంటి ప్రాజెక్టులను ముందు పెట్టుకుని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లే లేకపోవడం చర్చగా మారింది. ఇప్పటికైనా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ స్థానాలను పూర్తి స్థాయిలో నియమించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

హోదా మార్పునకు బీఎంఎస్ కృషి



మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్ నుంచి త్వరలో జనరల్ అసిస్టెంట్‌గా హోదా మారేందుకు కృషి చేశామని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శ్రీరాంపూర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా డిసిగ్నేషన్లతో కార్మికులకు సమాజంలో చిన్న చూపు ఉందన్నారు. దీనివల్ల వారి పిల్లలు చదివే విద్యాసంస్థల్లో సైతం చిన్నచూపు చూస్తున్నారన్నారు. ఈ విషయాన్ని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆ చర్చలు సఫలం కావడంతో త్వరలో డిసిగ్నేషన్లలో మార్పు చేస్తూ జనరల్ అసిస్టెంట్‌గా సింగరేణి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, నాయకులు తిరుప తి, రాజు, కిరణ్ కుమార్, కిశోర్, కిషన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోలేటి సీహెచ్‌పీ ఏరియాలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హెచ్‌ఎంఎస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీహెచ్‌పీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రసిడెంట్ పతెం రాజబాబు మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో డ్యూటికి రావాలంటే రోడ్డు సక్రమంగా లేదన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆరీఫ్, ఉమామహేశ్వర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

రెబ్బెన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జీఎం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మార్చి నెల 31వ తేదీలోగ్గా దరఖాస్తులను అందజేయాలని కోరారు.



సింగరేణి మనుగడకు సహకరించాలి

కాసిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకునేందుకు యూనియన్‌లకు అతీతంగా అందరూ సహకరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. శుక్రవారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ కొనసాగితేనే కార్మికులు,కార్మిక సంఘాలకు భద్రత ఉంటుందన్నారు. కంపెనీ భవిష్యత్‌ను కాపాడుకునేందుకు యూనియన్‌లు, అధికారులు సమష్టిగా పని చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేత

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


జన్నారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్ పరిధిలో అటవీ శాఖ చెక్‌పోస్టుల వద్ద రాత్రి 9 గంట లనుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకోపోకలను నిషేధిస్తూ విధించిన ఆంక్ష లను శుక్రవారం ఎత్తివేశారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్‌జర్‌వేటర్ రాకేష్ డోబ్రియాల్‌ను కలిసి అటవీ శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందించారు. చెక్‌పోస్టుల వద్ద నుంచి ఒక్క ఫిర్యాదు రాకూడదని ఎమ్మెల్యే పీసీసీఎఫ్‌కు విన్నవించారు. స్థానికులు తమ ఆధారాలు చూపించి రాకపోకలు సా గించవచ్చని వారిని అడ్డుకోవద్దని అధికారు లకు తక్షణ ఆదేశాలు జారీచేస్తున్నట్లు పీసీసీఎఫ్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

దండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళపేట గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన అక్కల శేఖర్-సునీత అనే దంపతులకు తీవ్రగాయాలు అ య్యాయి. భార్యభర్తలు ఇద్దరు బైక్‌పై జన్నారం మండలం రోటిగూడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై ఉన్న సునీత తలకు తీవ్రగాయాల య్యా యి. శేఖర్‌కు చేయి విరిగింది. గాయపడిన వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. మెరుగైన వైద్యం కోసం సునీతను మంచిర్యాల ఆసుపత్రికి తరలిం చారు. సంఘటనస్థలానికి దండేపల్లి పోలీసు లు చేరుకొని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు.

ప్రజావాణి రద్దు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి ఎన్నికల దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేశామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్‌ముగిసేంత వరకు ప్రజావాణి నిలిపివేస్తామని ఆయన వివ రించారు. ప్రజలు గమనించాలని కోరారు.



చాప కింద నీరులా డయేరియా



● ఒకరి మృతి, పలువురికి తీవ్ర అస్వస్థత ● ఆసుపత్రికి పరుగులు పెడుతున్న బాధితులు

చెన్నూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణం తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో డయేరియా చాప కింద నీరులా విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్రఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని పలు కాలనీలకు చెందిన పలువురు వాంతులు, విరేచనాలతో స్థానిక ప్రభుత్వ ప్రైవే టు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో 67 డయేరియా కేసులు నమోదైనట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. కాగా పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ, పట్టణ ప్రాంతమైన మంచిర్యాలకు పలువురు డయేరియాతో బాధపడుతూ చికి త్స పొందుతున్నట్లు సమాచారం.

వారం రోజుల వ్యవధిలో 67 కేసులు

వారం రోజుల వ్యవధిలో చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 67 కేసులు నమోదైనట్లు ఆసుపత్రి సూపరిం టెండెంట్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈనెల 1న ఎని మిది మంది, 2న ఏడుగురు, 3న 13 మంది, 4న ఎనిమిది మంది, 5న 16 మంది, 6న 12 మంది, శుక్రవారం మూడు కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు.

డయేరియాతో ఒకరు మృతి

పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ వీధికి చెందిన చొక్కారపు రవీందర్ (55) డయేరియాతో బాధపడుతూ ఈ నెల 4న మృతి చెందాడు. కుటుంబీకుల కథనం ప్రకా రం.. మూడు రోజులు వాంతులు, విరేచనాలతో బాధపడు తూ ఇంట్లోనే చికిత్స పొందినట్లు తెలిపారు. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు మృతిచెందినట్లు తెలిపారు.

కలుషిత నీరే కారణం..


పట్టణానికి సరఫరా అయ్యే మంచి నీరు కలుషితం కావడం వల్లనే డయేరియా ప్రబలినట్లు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టణానికి సమీపంలోని బతుకమ్మ వాగు నుంచి పట్టణంలోని పలు కాలనీలకు తాగునీరు సరఫరా జరుగు తోంది. అయితే కొన్ని ప్రాంతాలకు మాత్రం మిషన్ బగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు స్వచ్ఛంగా లేకపోవడం తో నీటిని ఎవరూ తాగడానికి వినియోగించడం లేదు. బతు కమ్మ వాగు ద్వారా అక్కడి పంప్ హౌజ్ నుంచి వచ్చే ప్రధా న పైపులైన్‌కు అమ ర్చిన కుళాయిల ద్వారా వచ్చే కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా జరుగుతుంది. పట్టణం లోని బట్టిగూడెం, జెండవాడ, సొన్నాయిల వీధి, లైన్‌గడ్డ, శివాల యం వీధి, కోటబొగడ, మంగలి బజార్ తదితర ప్రాం తాల్లో బతుకమ్మ వాగు ద్వారా సరఫరా చేసే ప్రధాన పైపు లైన్లకు నల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని వారే అధికంగా వాం తులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చేరుతుం డడం ఆందోళన కలిగిస్తోంది. బతుకమ్మ వాగు సంప్ హౌజ్ వద్ద ఫిల్టర్ బెడ్ లేకపోవడంతో ఆనీరు కలుషితమై సరఫరా జరుగుతుందే మోనన్న అనుమానాలు రేకెత్తుతు న్నాయి. ఈనీటిని తాగిన స్థానికులు వాంతులు, విరేచనా లకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పం దించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు: డయేరియాతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి సూచించారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శిం చారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పట్టణంలోని పలు కాలనీ ల్లో నీరు కలుషితం కావడం వల్లనే డయేరియా ప్రబలింద న్నారు. కాలనీ వాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అం దించాలని మున్సిపాలిటీ అధికారులను కోరారు. వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో అమృత్ పథకం ద్వారా నీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.


సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులు


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో డయేరియా ప్రబలు తున్న దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ సూచించారు. శుక్రవారం చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మున్సిపల్, శాని టేషన్, ఇరిగేషన్, వైద్య సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడు తూ డయేరియా విజృంభణపై అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. సామాజిక ఆరోగ్యకేంద్రానికి రోజుకు ఆరు నుంచి 10 కేసులు వస్తున్నాయన్నారు.

ఇప్పటివరకు సామాజిక ఆరోగ్యకేంద్రం ఆసుపత్రిలో 67 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రజలు వేడి చేసి చల్లా ర్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. నీరు కలు షితం వల్లనే డయేరియా ప్రబలుతుందని పేర్కొన్నారు. డయేరియాకు గురైన వారు వెంటనే ఆసుపత్రికి రావాలని ఎక్కువగా ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచించారు. బతుక మ్మ వాగు సంప్ హౌజ్ నుంచి వచ్చే మంచినీటిని పరీక్షల నిమిత్తం వరంగల్ ల్యాబ్‌కు పంపించినట్లు ఆయన తెలిపా రు. పరీక్షల అనంతరం పూర్తి సమాచారం ఇస్తామన్నారు. బతుకమ్మ వాగు, మిషన్ భగీరథ నీటి సరఫరాను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితర శాఖలతో ఇంటింటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తామన్నారు. చెన్నూరు పట్టణంలో 22 వాటర్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. ఈ ప్లాంట్‌లను తనిఖీ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఆ నీటిని కూడా పరీక్షల నిమిత్తం వరంగల్ ల్యాబ్‌కు పంపాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అన్ని మందు లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌వో అమృత, సూపరిం డెండెంట్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

వారం రోజులుగా చికిత్స పొందుతున్నా

బద్రి శ్రీనివాస్, కొత్తగూడెం కాలనీ, చెన్నూరు



వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరి వారం రోజులుగా చికిత్స పొందుతున్నాను. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని తాగుతున్నాం. నీరు కలుషితం కావడం వల్లనే ఈ పరిస్థితి దాపురించింది.

విరేచనాలు, వాంతులు అయ్యాయి..

బోడె రంజిత్‌కుమార్, శివలింగాపూర్



మూడు రోజుల నుంచి వాంతులు విరేచనాలు కావడంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాను. నాతో పాటు నాన్న శంకరయ్య కూడా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శుక్రవారం ఇదే ఆసుపత్రిలో చేరాడు. నల్లాల ద్వారావచ్చే నీటిని తాగడం వల్లనే అనారోగ్యానికి గురయ్యాం.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: కలెక్టర్


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుం దని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నా రు. శుక్రవారం మండల కేంద్రం లోని కేజీబీవీ పాఠశాలను సంద ర్శించారు. విద్యార్థినీలతో మాట్లా డారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం బోజన శాలను పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన బోజనం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సంబం ధిత అధికారులు నిర్మాణాలను పరిశీలించాల న్నారు. అనంతరం పోతనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నాణ్యమైన భోజనం అందిం చాలని సూచించారు. అనంతరం నర్సింగాపూ ర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సం దర్శించారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాల ను, తరగతి గదులను ఆధునీకరించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫసీర్ కనకలక్ష్మీ, మహేష్, ఆర్‌ఐ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారంగపల్లిలోని దుబ్బపల్లి గ్రామంలో శుక్రవారం సత్యనారా యణ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య, బండి సదానందం, భక్తులు పాల్గొన్నారు.

● చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామిని మంచిర్యాలలోని ఆయన నివాసంలో బొక్కలగుట్ట గ్రామస్తులు కలి శారు. 12న బొక్కలగుట్టలో జరిగే వేంకటే శ్వర స్వామి కల్యాణానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందించారు. గ్రామ స్థులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

జైపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహాత్మాజ్యోతి బాపూలే , సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ వనజారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అం దించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అరవిందరావు, నాయకులు అర్నె సమ్మయ్య, లింగస్వామి, ఆసంపల్లి రాయ మల్లు, జాడి యేసయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల నిలిపివేత

చెన్నూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్ మం డలాల పత్తి కొనుగోలు ఆన్‌లైన్ రిజిస్ట్రేష న్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉన్న వారు మాత్రమే పత్తిని విక్రయించాల న్నా రు. ఇందుకు రైతులు సహకరించాలని కోరా రు. రైతులు ఎవరి పత్తికి వారే ఫొటోలు దిగాలని సూచించారు. రైతులు దశల వారీ గా పత్తిని విక్రయించుకోవాలని ఆయన సూచించారు.

చోరీ నిందితులు అరెస్టు

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కోటేశ్వర్‌రావుపల్లిలో చోరీ చేసిన నిందితులను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం కోటేశ్వర్‌రావుపల్లి గ్రామానికి చెందిన కందికట్ల సత్తమ్మ తన భర్త, తన చిన్న కొడుకుతో కలిసి గురువారం సాయంత్రం సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడ గా బీరువాలోని బట్టలు చిందర వందరంగా ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు చంద్రహారం, బంగారు కమ్మ లు, ఉంగరం, వెండి గొలుసులు కనిపించకపోవడంతో సత్తమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని తనిఖీ చేశారు. వారి పర్సులో బంగారు ఆభరణాలు ఉండ డంతో వారిని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుప ర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నర్సయ్య, కానిస్టేబుళ్ల జంగు, అఖిల్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్

తాండూర్‌లో 30 కుక్కల మృతి

తాండూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల కేంద్రంలోని పాత సింగరేణి ఎంటీకే వన్ ఇంక్లైన్ డంపింగ్ యార్డు దగ్గర ఒకేసారి సుమారు 30 కుక్కలు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. వీధుల్లో సంచరిస్తూ ప్రజల ను ఇబ్బందులు పడుతుండడంతో అందిన ఫిర్యాదు మేరకు ఈ నెల 6వ తేదీన కుక్కలను నిర్మూలించడం కోసం మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి దివాకర్ నేతృత్వంలో కుక్కలను పట్టే వారిని పిలిపించారు. కుక్కలను పట్టుకు నేందుకు వాటిపై మత్తుమందు ప్రయో గం చేసిన సిబ్బంది అనంతరం స్థానిక అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. తెల్లవారేసరికి మొత్తం కుక్కలు మరణిం చడంతో వాటికి ఇచ్చిన మత్తు డోసు అధికమై మృత్యువాత పడ్డాయని ప్రచా రం జరుగుతోంది.

కుక్కలపై జరిగిన విషప్రయోగం వల్లే మృతిచెంది ఉంటాయని పలువురు జంతు ప్రేమికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవోతో పాటు గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా కుక్కలకు మత్తుమందు మాత్రమే ఇచ్చామని, వాటి చావుకు కారణాలు ఏంటో తమకు తెలియదని అన్నారు. కాగా శునకాల మృతిపై సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, జంతుప్రేమి కులు డిమాండ్ చేస్తున్నారు.

మిస్టరీగా యువకుడి మృతి

- కొడుకు మరణంపై తల్లి సుజాత అనుమానాలు
- ఆరు నెలలు గడిచినా ముందుకు సాగని దర్యాప్తు


వంశీకృష్ణ (ఫైల్)

మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్‌కోసం బోరు నీళ్ల పడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మరణించాడు. కాగా తన కొడుకుది ప్రమాదం కాదని.. తల్లి సుజాత అనుమా నాలు వ్యక్తం చేస్తూ అదేరోజు పోలీస్‌స్టేష న్‌కు వెళ్లి ఎస్సైకి ఫిర్యాదు చేసింది. అయితే ఆరు నెలలు గడుస్తున్నా దర్యాప్తు ముందుకు సాగకపోగా ప్రమాదంగా చిత్రీకరించి, కేసును ముగించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన గత సంవత్సరం ఆగస్టు 19న దండేపల్లి మండలం మేదరిపేటలో జరిగింది. ఆరు నెలల తరువాత ప్రస్తుతం ఈ విషయమై గ్రామం లో జోరుగా చర్చ జరుగుతుండటంతో మళ్లీ తెరపైకి వచ్చింది.

● **మిస్టరీగా మారిన ఘటన...**

లక్షెట్టిపేట పోలీస్‌సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన పొన్నం వంశీకృష్ణ (22) అనే యువకుడు మండలంలోని మామిడిపల్లికి వెళ్లే దారిలో నూతన గృహ నిర్మాణం చేపడుతున్నాడు. వంశీకృష్ణ ఇంటిని ఆనుకొని మంద మర్రికి చెందిన సిద్దం అంజయ్య అనే వ్యక్తికి నాలుగెకరాల భూమి ఉంది. ఆ భూమి లోకి వెళ్లేందుకు సరైన దారి లేదు. ఆ భూమిలో ప్లాట్ల వెంచర్ ఏర్పాటు చేస్తే పెద్దమొత్తంలో డబ్బులు సంపా దించవచ్చనే ఆలోచనలో ఉన్న అంజ య్య తన స్థలంలోకి వెళ్లేందుకు దారి కోసం కొంతభూమి ఇవ్వాలని బంధు వైన వంశీకృష్ణను అంజయ్య కోరినట్లు సమాచారం. భూమి ఇచ్చేందుకు వంశీకృష్ణ నిరాకరించడంతో నాలుగు సంవత్సరాలు గా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. వంశీకృష్ణ దినచర్యపై నిఘా ఉంచిన గుర్తుతెలియని వ్యక్తులు కొందరు అతను నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి ప్రతిరోజు ఉదయం పూట నీళ్ల పట్టేందుకు వెళ్తుండటాన్ని గమనించారు.

ఈక్రమంలోనే అతడిని హత్య చేసేందుకు పథక రచన చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా బోర్ ఆన్‌చేసే సమయంలో విద్యుదాఘా తానికి గురయ్యే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ప్రజలు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆగస్టు 18న ఉదయం యథావిధిగా ఇంటికి నీళ్లు పట్టేందుకు వచ్చిన వంశీకృష్ణ బోర్ స్విచ్ వేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీకృష్ణ తల్లి సుజాత తన కుమారుడు మరణించడంపై అనుమానాలు ఉన్నాయని పేర్కొం టూ దండేపల్లి ఎస్సైకి ఫిర్యాదు చేసింది. అయితే ఆరు నెలలైనా దర్యాప్తు ముందుకు సాగకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

విద్యుదాఘాతంతోనే మృతిచెందాడు..

- లక్షెట్టిపేట సీఐ నరేందర్

ఘటనకు సంబంధించి లక్షెట్టిపేట సీఐ నరేందర్‌ను వివరణ కోరగా మృతుడు వంశీకృష్ణ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామ ని తెలిపారు. మృతుడి చేతికి విద్యుదాఘాతంతో గాయాలు కూడా ఉండగా, పోస్టుమార్టం నివేదికలో నూ విద్యుదాఘాదానికి గురై మృతి చెందాడని వైద్యుడు నిర్ధారించినట్లు తెలిపారు. మందమర్రిలో ఉంటున్న వంశీకృష్ణ బాబాయ్ సిద్దం అంజయ్యకు, మృతుడికి మధ్య గొడవలు ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ, జరిగిన ఘటనకు, వారిద్దరి మధ్య ఉన్న గొడవకు ఎలాంటి సంబంధంలేదని వివరిం చారు. విద్యుదాఘాతంతోనే మృతిచెందిన ట్లుగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని కేవీకే

(5వ పేజీ తరువాయి..)

నష్టపరు స్తుండడంతో పూర్తిస్థాయిలో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించలేక పోతున్నారు. విత్తనోత్పత్తి సైతం సరిగా దిగుబడి కావడం లేదు. కృషి విజ్ఞాన కేంద్రానికి కేవలం ముందు నుంచే ప్రహరీ ఉండడం, ఇతర మూడు పక్కల ఎలాంటి ప్రహరీలేకపోవడం, ఫెన్సింగ్ లేకపోవడంతో అటవీ జంతువులు, పశువులు కృషి విజ్ఞాన కేంద్రంలోనికి వెళ్లి పంటలను ధ్వంసం చేస్తున్నాయి.

● **వర్షాకాలంలో చెరువును తలపిస్తూ..**

సుమారు 20 ఎకరాలకు పైగా భూమి బీడుగా ఉంటుంది. వర్షకాలంలో ఈ భూమిలో నీరు నిల్వ ఉండి చెరువుల మాదిరిగా దర్శనమిస్తున్నాయి. విత్తనోత్పత్తి కేంద్రంగా ఏర్పాటయిన కేవీకేకు అనుకూలంగా భూమి చదును లేకపోవడం, వ్యవసాయం చేయడానికి ఆరు బోర్లు కావాల్సి ఉండగా కేవలం రెండు బోర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పూర్తిస్థాయిలో పంటను సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. సాగు చేసిన పంటకు సైతం ఫెన్సింగ్, ప్రహరీ లేకపోవడంతో పండించిన పంట సైతం పశువులపాలవుతోంది.

● **గోదాం లేకపోవడంతో..**

కేవీకే కేంద్రంలో వరి, కంది, వేరుశనగా, జనుము, నువ్వులు వంటివి ప్రతీ ఏటా విత్తనోత్పత్తి చేస్తుంటారు. దిగుబడి వచ్చిన పంటను భద్రపరిచేందుకు గోదాం సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వేల మంది రైతులకు శిక్షణ కార్యక్రమాలు ప్రతీ ఏటా నిర్వహిస్తుంటారు. ఇందుకు అనుకూలంగా గదులు, హాల్ లేకపోవడంతో ఆరుబయటే శాస్త్రవేత్తలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా కలెక్టర్ స్పందించి కేవీకే అభివృద్ధికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

కేవీకేను అభివృద్ధి పర్చాలి

- శరత్, రైతు, నందులపల్లి



కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతుల కు మరిన్ని సేవలు అందుబాటులోకి రావాలం టే కేవీకేను ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి చేయాలి. వివిధ పంటల విత్తనోత్ప త్తి కోసం బీడుగా ఉన్న భూమిని అందుబా టులోకి తీసుకురావాలి. కేవీకేకు వేలాది మంది రైతులు వస్తున్నారు. అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేట ప్పుడు పూర్తిస్థాయి వసతులతో కూడిన భవనం అందుబాటులో లేకపోవడం ఇబ్బందులు కలిగిస్తుంది.

వ్యవసాయ హబ్‌గా మార్చాలి

- దుగుట తిరుపతి, రైతు, మాల గురిజాల



విత్తనోత్పత్తి కేంద్రంగా ఉన్న కేవీకేను పరిశోధన కేంద్రంగా అభివృద్ధి పర్చాలి. కేవీకేను వ్యవసాయ హబ్‌గా మారిస్తే ఎంతో మంది రైతులకు ప్రయో జనం చేకూరుతుంది. కేవీకే ఆవరణలో రైతులకు అన్నివసతులు కల్పించడంతోపాటు అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకనిధులు కేటాయిస్తే బాగుంటుంది.

రైలు కింద పడి వివాహిత ఆత్మహత్య


భాగ్యవతి (ఫైల్)

బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన రాళ్లబం డి భాగ్యవతి(45) శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. భాగ్యవతి మూడు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొంది మందులు వాడుతున్నా బాగుకాకపోవడంతో అనారోగ్యం భరించలేక రైలు కిందపడి ఆత్మహ త్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలుకు ఇద్దరు కుమారైలు ఉన్నార ని, కుటుంబీకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు.

మార్కెట్ దూరం.. రవాణా భారం

'మిర్చి' రైతులకు మార్కెటింగ్ కష్టాలు



మిర్చి పంటను కోస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు

జిల్లాలో మిర్చి మార్కెట్ లేక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల క్రితం మిర్చికి మార్కెట్‌లో ధర ఎక్కువగా పలుకపోవడంతో జిల్లాలో క్రమంగా సాగు పెరుగుతోంది. వచ్చిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్, వరంగల్ ప్రాంతాలకు తరలిస్తూ అమ్ముకోవల్సిన పరిస్థితి నెల కొంది. దీంతో దూర భారంతో పాటు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- పంటను అమ్ముకోవడానికి నాగ్‌పూర్, వరంగల్ వెళ్లాల్సిందే..
- అన్నదాతపై అదనంగా ఖర్చులు
- జిల్లాలో మార్కెట్ యార్డు, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్

కౌటాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి సాగు చేస్తున్న రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతోంది. జిల్లాలో సుమారు 3.40లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇక్కడ ప్రధానంగా పత్తి, వరి సాగు చేస్తున్నారు. పత్తి పంటలో వరుసగా నష్టాలు వస్తుండడంతో కొంత మంది ధైర్యం చేసి మిర్చి పంట సాగు చేయ డంపై దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపిన రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మిర్చి సాగు ఆశాజనకంగా కనిపిం చింది. గడిచిన ఆరేళ్లలో మిర్చి సాగు గణనీయంగా పెరిగిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట దిగు బడులు ఉన్నా స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఈ ఏడాది..

ఈ ఏడాది జిల్లాలో 727 మంది రైతులు 1,406 ఎక రాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నారు. అత్యధికం గా కౌటాల మండలంలోని తాటిపల్లి, కన్కి, మొగడ్ దగడ్, గుడ్లబోరి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, పార్డి, వీరవెల్లితో పాటు తదితర గ్రామా ల్లో సుమారు 1,097పెరిగిన మిర్చి పంట సాగు చేశారు. ప్రస్తుతం మిర్చి పంట చేతికి వచ్చింది. ఈ ఏడాది పంగ దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీనికి తోడూ ప్రస్తుతం ధర సైతం పడిపోయింది. రెండేళ్ల క్రితం మిర్చికి ధరలు అత్యధికంగా ఉండడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపారు. కానీ ఈ ఏడాది ధర పడి పోయింది. దీనికి తోడు జిల్లాలో మిర్చి విక్రయిం చేందుకు మార్కెట్ సౌకర్యం లేకుండా పోయంది. దీంతో రైతులు ఇక్కడ పండిన పంటను మహారాష్ట్ర, వరంగల్‌కు తరలించి విక్రయించాల్సిన పరిస్థితి నెల కొంది. దీంతో దూరం వెళ్లాల్సి రావడంతో పాటు రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతు లు వాపోతున్నారు.

కూలీల కొరత..

మిర్చి పంట కోసేందుకు కూలీల కొరత అధికంగా ఉంది. దీంతో సరిహద్దున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ నుంచి కూలీలను తీసుకు వస్తున్నారు. కిలోకు రూ.10 చొప్పున చెల్లిస్తున్నారు. ఇటు దిగుబడి సరిగ్గా రాక అటు రవాణా భారం పెరగడం, ధర లేక పోవ డంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతు న్నారు. స్థాని కంగా మార్కెట్ యార్డు, మిర్చిని నిల్వ ఉంచుకునేలా గోదాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అమ్మకం ఎలా..

ఎకరానికి సుమారు 20 నుంచి 22 క్వింటాళ్ల దిగు బడి అంచనా వేసినా సుమారు 30 వేల క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంట నిల్వ చేసుకునేందుకు జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. మార్కెట్‌యార్డు కూడా అందుబాటులో లేక పోవ డంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులు దళారు లకు అమ్ముకో వల్సిన పరిస్థతి ఉంది. ఈ వైపు పెట్టుబ డి ఖర్చులు పెరిగిపోయాయి. మరో వైపు మార్కెట్ యార్డు లేక పోవడంతో రైతులు పంటను మహా రాష్ట్ర, వరంగల్, తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. జిల్లా నుంచి రైతులు ఎక్కువగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళుతున్నారు. పంట విక్రయించి తిరిగి రావడానికి సుమారు నాలుగు రోజుల సమయం పడు తోంది. పంట సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నం దున ప్రభుత్వం అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి..



- బడిగే దావూజీ పటేల్, కౌటాల

జిల్లాలో మిర్చి కొనుగోలుకు మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో పండించిన మిర్చి పంటను విక్రయించేందుకు మార్కెట్ యార్డు లేక పోవడంతో పంటను అమ్ముకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసాలకు గురవుతున్నాం. పంట వరంగల్ లేదా నాగ్‌పూర్‌కు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నా యి. దీంతో దూరాభారం అవుతుంది. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

వ్యాపారులకు అమ్ముకుంటున్నాం..



- దత్తు పాండురంగ్, కౌటాల

మార్కెట్ యార్డు సౌకర్యం లేక పోవడంతో స్థాని కంగా ఉన్న వ్యాపారులకే మిర్చి పం టను అమ్ముకుం టున్నాం. వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోక తప్పడం లేదు. దీంతో రైతులు నష్ట పోతున్నారు. దీని తోడు కూలీల కొరత సైతం ఇబ్బందికంగా ఉంది. ఇత ర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నాం.

జనజీవన స్రవంతిలోకి రావాలి

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మావోయిస్టు అంకుబాయి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

పెంచికలపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నక్సలైట్లు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పోరు కన్నా ఊరు మిన్న కార్యకరమంలో భాగంగా పెంచికలపేట మండలం ఆగర్‌గూడ గ్రామానికి చెందిన మావోయిస్టు సభ్యురాలు చౌదరి అంకుబాయి అలియాస్ అనిత కుటుంబ సభ్యుల ను పరామర్శించారు ఈ సందర్భంగా అంకుబాయి కుటుంబ సభ్యుల ప్రస్తుత స్థితిగతులతో పాటు వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వనం వీడి జనంలోకి వచ్చేలా చొరవ తీసుకోవాలని చెప్పారు. లొంగిపోతే ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రజలు, యువత వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్థులకు చీరలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, సీఐ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, ఎస్సైలు కొమురయ్య, ఆర్ఎస్సై ఓదేలు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన



మహారాష్ట్రలోని బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు

పెంచికలపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు బుధవారం పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా) వైద్య విజ్ఞానిక యాత్రలో భాగంగా మహారాష్ట్రలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. సైన్స్‌కు సంబంధించి విద్యార్థులకు ఈ యాత్ర ఎంతగానో దోహ దపడిందని, చాలా విషయాలు తెలుసుకున్నారని ప్రధానోపాధ్యాయురా లు విజయనిర్మల తెలిపారు. యాత్రలో ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, బడేసాహెబ్, గంగా భవాని, లక్ష్మి, సంతోష్, భారతి, ఆప్తాబ్, ఈశ్వరరావు, ధనరాజ్, ఆత్మారాం, సాదియా, భాగ్యశ్రీ, వీవో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ భవన సముదాయ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై శుక్రవారం రాకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిదులు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు పట్టభద్రులు 6,137, ఉపాధ్యాయులు 470 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితాను అందజేస్తామని తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, షామియానా లు, వెలుతురు, ఫ్యాన్‌లు మిగితా వసతులను కల్పిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు పోలింగ్ రోజు పాలొగనే ఏజెంట్ల జాబితాను అందజేయాలని సూచించారు కౌంటింగ్ మార్చి 3న కరీంనగర్‌లో నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎన్నికల పర్యవేక్షకుడు సునీల్, డీటీ శ్యాంలాల్, రాజకీయ పార్టీల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



సిర్పూర్(టి)లో వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

సిర్పూర్(టి), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశా లలో ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి, ఓటర్లకు పూర్తి సౌకర్యాలు కల్పిం చాలని చెప్పారు. మరుగుదొ డ్లు, తాగునీరు, వెలుతురు, ఫ్యాన్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశిం చారు. మండలంలో 23 మంది ఉపాధ్యా యు లు, 330 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆమె వెంట గిర్దావర్ మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు సదాశివ య్య, సీఆర్పీ పవన్‌కు మార్ ఉన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తనిఖీ చేశారు. సౌకర్యాలపై సబ్ కలెక్టర్ ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ సంతోష్ ఉన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలిం చారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాల న్నారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది జాఫర్, కార్యదర్శి ఆసీఫ్ అలీ, హెచ్ఎం జయరాజ్ తదితరులు ఉన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తనిఖీ చేశారు. సౌకర్యాలను అడిగి తెలుసుకుని సూ చనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ కవిత, ఆర్ఐ నాందేవ్ తదితరులు ఉన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలం లోని పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. మౌలిక వసతులు కల్పిం చాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో ఆల్బర్ట్, ఆర్ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

జొన్న, చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన

కౌటాల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకారంతో కౌటాల ఆసిఫాబాద్, కెరమెరి, కౌటాల రైతులకు పర్భని శక్తి జొన్న పంట, చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జొన్న పంట వేసే ముందు నాణ్యమైన విత్తనాల ఎంపిక భూమి చదును చేసే విధానం, విత్తనాలు విత్తే విధా నం, పంటలకు సోకే తెగుళ్లు, నివారణ చర్య లు, దిగుబడిపై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ సుబ్బారావు వివరించారు. అనంతరం క్షేత్రస్థా యిలో జొన్న పంటలను పరిశీలించారు. రైతులు అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. చీడపీడలు సోకితే నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భం గా తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధి కారిణి ప్రేమలత, విజయవాహిని చారిటబుల్ ఫౌండే షన్ ప్రోగ్రాం లీడ్ వాసు, పద్మాకర్ తది తరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్‌కు ఘన నివాళి

వాంకిడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కటిక పేదరికంలోనూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఉన్నత చదువుల కోసం ఆమె చేసిన కృషి మరు వలేనిదని కొనియాడారు. కార్యక్ర మంలో బీఎస్ఐ(బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు అశోక్, జయరాం, తిరుపతి, విలాస్, రాజేంద్రప్రసాద్, సందీప్, రోషన్, అరుణ్, ప్రసాద్, ప్రతాప్, రమేష్, రాజేశ్వర్, పెంటు, బలవంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఈశ్వర్ నాయక్, ఉత్తమ్, భగవాన్, మిలింద్, జగన్, సుదాం, మాతా రమాబాయి మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

- ఆసిఫాబాద్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన వక్కలగడ్డ రామకృష్ణ కాశి ప్రయాణంలో భాగంగా శుక్రవారం ఆసిఫాబాద్ కు చేరుకున్నారు.
  - ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా సహకార అధికారి బిక్కు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి మిలింద్, ఏఎంసీ అధికారి అశ్వక్ అహ్మద్‌లు కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.
- కెరమెరి: మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, చైల్డ్ మ్యారేజ్‌లపై అవగాహనకల్పించినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.
- కాగజ్‌నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో రైతులు గ్రాఫ్టింగ్ పద్ధతిలో చేస్తున్న పంటల సాగు విధానాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు.
  - బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలంను కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సన్మానించారు.
  - కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌పై కలెక్టర్ విచారణ చేపట్టాలని మాజీ కౌన్సిలర్ బాల్కశ్యాంకుమార్ డిమాండ్ చేశారు.
- రెబ్బెన: బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించాని బీజేపీ అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు.
- చింతలమానేపల్లి: చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండె విఠల్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.
- దహెగాం: నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి అశ్విని అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులి పురుగుల మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు.

గంగాపూర్ జాతరను విజయవంతంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

రెబ్బెన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్‌లో ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు జరుగనున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చే యాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శుక్రవారం గంగాపూర్ జాతర ని ర్వహించే స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్, తాగు నీటి సౌకర్యం, పారిశుధ్యం తదితర సమస్య లను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే రక్షణ చర్యలు కూడా తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ గం గాపూర్ జాతరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుం డా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశా రు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, ఈవో బాపిరెడ్డి, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై దృష్టి

» పలు చోట్ల ప్రజల నుంచి ఫిర్యాదులు » తొలగింపునకు అధికారుల చర్యలు



రాజీవ్ స్వగృహకాలనీలో అక్రమంగా కట్టిన ప్రహరీగోడ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించారు. సిబ్బంది ద్వారా గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు దీనిపై చర్చించారు. వారం రోజులుగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం బస్టాండు వెనుక వైపు ఉన్న మున్సిపల్ స్థలంలో నిర్మించిన షెడ్డును ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని ప్రధాన డ్రైనేజీ 55 ఫీట్లు ఉంటుంది. కొంత మంది కబ్జా చేసి అక్రమ కట్టడాలను నిర్మించారు. అక్రమ కట్టడాలనికి తొలగించాలని శుక్రవారం ఇండస్ట్రియల్ వాసులు నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వ కంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కాల్వలు, ఫుట్ పాత్‌లు, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఇష్టారాజ్యంగా దుకాణాలు వెలిశాయి. ఐదేళ్ల క్రితం అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టినా వీటిపై చర్యలు తీసుకోలేదు. కాగజ్‌నగర్ మండలంలోను అక్రమ కట్ట డాలు జోరుగా సాగుతున్నాయి. బోరిగాం శివారులోని రాజీవ్ స్వగృహ ఇళ్ల స్థలాలకు ఆనుకొని ఉన్న రహదారిపైనే ప్రహరీగో డను నిర్మించారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోక పోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమి షనర్ అంజయ్యను వివరణ కోరగా అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. విచారణ జరిపి తొలస్తామని తెలిపారు.